కథ

# ఆన్‌లైన్ లవ్!

**Civilization begins with order grows with liberty and dies with chaos!**

**-Will Durant**

విశాలమైన ఆ ఏసీ రూమ్‌లోని కంప్యూటర్ స్క్రీన్‌కి ఎదురుగా కూర్చుని ఉన్నారు ఇన్‌స్పెక్టర్ కాశ్యప్, సైకాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణ.

ఆ కంప్యూటర్ ఇంటర్నెట్‌కి అనుసంధానపరచబడి వుంది.

వారిద్దరూ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లో వున్నత స్థాయి అధికారులు. తెరపై కనబడుతున్న దృశ్యాన్ని ఇద్దరూ ఆందోళనగా చూస్తున్నారు.

ఆ తెరపై పన్నెండేళ్ళ అమ్మాయి ఫోటో కనబడుతోంది.

పూర్తి నగ్నంగా!

ఆ అమ్మాయి ఎవరు?

ఎక్కడుంది?

ఆమెనలా చేసిందెవరు? ఇంకా ఎందరు...

రకరకాల ప్రశ్నలు వారిని వేధిస్తున్నాయి.

గతంలో ఏవో కొన్ని సెక్స్ మేగ్‌జైన్లలో కొందరు పెద్దవాళ్ళకి మాత్రమే అందుబాటులో వుండే దృశ్యాలు, బొమ్మలు, కథలు ఇప్పుడు కేవలం కంప్యూటర్‌మీద కొన్ని బటన్లు నొక్కగానే తెరపై ప్రత్యక్షమవుతున్నాయి. ఇళ్ళల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్లు వచ్చేస్తున్న ఈ రోజుల్లో వీధికో నాలుగు సైబర్ కేఫ్‌లు పుట్టుకొస్తున్న ఈ రోజుల్లో టీనేజ్ పిల్లలపై అవి ఎంత భయంకరమైన ప్రభావం చూపిస్తాయో అర్థమై డాక్టర్ రామకృష్ణ బాధగా కాశ్యప్ కేసి చూసాడు.

''డాక్టర్! ఈ రకమైన సెక్స్ నేరాలు ఈ మధ్యన ఎక్కువవుతున్నాయి. అయితే ఆ ఫోటోలను ఆన్‌లైన్ వెబ్‌లోకి ఎవరు విడుదల చేస్తున్నారో ఆనవాలు తెలియడంలేదు. ఆధునికత అంటే లైంగికపరమైన స్వేచ్ఛ అని నేటి టీనేజర్లు భావిస్తూ వాటిపట్ల ఆకర్షితులవుతున్నారు. వారిని గుర్తించిన నేరస్థుడు వారితో 'ఆన్‌లైన్ సంభాషణ' ప్రారంభిస్తాడు. తరువాత వారిని మభ్యపెట్టో, భయపెట్టో బ్లాక్‌మెయిల్ చేసో ఏదోరకంగా తన సెక్స్ వాంఛకు బలి పశువును చేస్తాడు. ఇంతవరకూ మన పరిశోధనలలో తెలిసిందే. అయితే వాటికి ఆధారాలు దొరకడంలేదు'' చెప్పాడు కాశ్యప్.

''ఒకే కాశ్యప్. పోనీ మనం కూడా ఆ సైట్‌కి తరచు విజిట్ చేసి ఆ నేరస్థునితో పరిచయం సంపాదిస్తే...''

డాక్టర్ రామకృష్ణ చెప్పింది విని చిన్నగా నవ్వాడు కాశ్యప్.

''అది కూడా చేశాను డాక్టర్. కానీ సంభాషణ ప్రారంభించే మొదట మన ఇంటర్నెట్ సెంటర్ తాలూకు ఐడెంటిటీని అతను అనుమానించినట్టున్నాడు. వెంటనే షట్ అయిపోయింది. సైబర్ ఛాట్ ద్వారా అతనిని పట్టుకోవడం ఈ బొమ్మలు చూడగలిగినంత సులువు కాదు'' అన్నాడు.

డాక్టర్ రామకృష్ణ సీరియస్‌గా ఆలోచించడం ప్రారంభించాడు.

తరువాత రోజే సైబర్ స్పేస్ క్రైమ్స్ సెమినార్‌లో అతను మాట్లాడవలసి వుంది.

★★★

''మనకి నిజంగా ఇది కొత్త సమస్యే. దీనిని ఎదుర్కొనే పద్ధతుల గురించి మరింత అధ్యయనం చేయాలి. అసలు ఈ సమస్యకు మూలం మనుషుల్లో పెరిగిపోతున్న అభద్రతా భావం'' డాక్టర్ ఒక నిముషం ఆగాడు.

సెమినార్‌లోని సభ్యులంతా ఆ సైకాలజిస్ట్ ఉపన్యాసాన్ని ఆసక్తిగా వింటున్నారు.

''అవును... అభద్రతా భావం. ఈ ఆధునిక యుగంలో మనుషుల మధ్య ఆత్మీయత, అనుబంధాలు పలుచబడిపోతున్నాయి. డబ్బు సంపాదన, ఏదోరకంగా శారీరక అవసరాలు తీర్చుకోవడం- ఇదే ఆధునికత అన్న భ్రమలో నేటి యువత మునిగిపోయింది. దాని పరిణామమే ఈ హైటెక్ నేరాలు- సైబర్ సెక్స్- కంప్యూటర్ల సహాయంతో దొంగనోట్ల ముద్రణ- విజ్ఞానం పెరిగేకొద్దీ దానితో చేసే నేరాలు కూడా పెరుగుతున్నాయి. ఇంటర్నెట్ స్నేహాలకోసం వెంపర్లాడే టీనేజర్ ఇలాంటి వాటికి తొందరగా లొంగిపోతున్నారు. అసహజ లైంగిక కార్యాలు పిల్లలను సెక్స్‌కి వాడుకునే పిడోఫిలిక్స్, హోమో సెక్సువాలిటీ, లెస్బియనిజం... ఇవన్నీ విశృంఖలంగా పెరిగిపోతున్నాయి. ఇవి ఆధునికత అనో, స్వేచ్ఛా నిదర్శనమనో భ్రమలో తాత్కాలిక ఆనందం కోసం తప్పులు చేస్తున్నారు. ఇలా శారీరక అవసరం తాత్కాలికంగా తీరిన తరువాత మనసు మాత్రం ఇంకా అసంతృప్తిగానే వుంటుంది. ఆ అసంతృప్తి మరోసారి తప్పు పనికి ప్రోత్సహిస్తుంది. మెల్లగా అసంతృప్తితోపాటు గిల్టీ ఫీలింగ్ కూడా మొదలవుతుంది. దానిని కప్పిపుచ్చుకోవడానికి వారు చేసే పని సరి అయినదని వాదిస్తారు. వీరందరూ ఒక్కటి గుర్తుపెట్టుకోవాలి. మనుషులకు, జంతువులకు తేడా వుంది. మనుషులు పెళ్లి చేసుకునేది కేవలం సెక్స్ కోసమే కాదు. దానితోపాటు లభించే ఆత్మ సంతృప్తికోసం, మానసిక స్వాంతన కోసం. పెద్దవాళ్ళు తాము చేసే పనులు పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని కలిగిస్తాయో కూడా గమనించి మసలుకోవాలి. ఏది మంచో, ఏది చెడో తెలియని వయసులో వాడు ఎలా సులువుగా ఆకర్షించే ఆనందాలకి లొంగిపోతున్నారు. ఇప్పుడు వారు బాధితులు. వారు ఈ విశృంఖల లైంగికత్వానికి అలవాటుపడ్డాక వారే నేరస్థులుగా మారతారు. నేటి బాలలే రేపటి పౌరులు. అంటే రాబోయే తరాలలో భారతదేశం ఇలాంటి సెక్స్ మానియాక్స్‌తోనో, లెస్బియన్స్‌తోనో నిండిపోనుందా? ప్రపంచానికి వైటూకే పెద్ద సమస్య కావచ్చు. కానీ అంతకంటే పెద్ద సమస్యలు మనుషుల మధ్య ఆత్మీయతను ఎలా పెంపొందించాలి? కామానికి, ప్రేమకీ తేడా ఏమిటి? విజ్ఞానాన్ని సమాజహితం కోసం ఎలా వినియోగించాలి? ఇవే అసలు సమస్యలు. ఇవే అసలు వైటూకేలు. దీనికిముందీ 'సైబర్ సెక్స్'ని ఆపాలి. దానికి మీ అందరి సహకారం కావాలి.''

డాక్టర్ రామకృష్ణ తన ప్రసంగాన్ని ముగించగానే కరతాళధ్వనుల సంప్రదాయానికి విరుద్ధంగా అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. వారి కళ్లల్లో అమాయకంగా ఆప్యాయతతో ఎదురుచూసే పిల్లలు, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు... ఇవన్నీ ఊహాదృశ్యాలుగా కదులుతున్నాయి.

ఇంతలో ముందు వరుసలోని ఒక వ్యక్తి లేచి నిలబడ్డాడు.

''సర్! నా పేరు జయంత్. సైబర్‌టెక్ ఇంజనీర్ని. నేను మీకు సహాయపడగలను'' క్లుప్తంగా, స్పష్టంగా చెప్పాడతను.

రామకృష్ణ అతనికేసి చూసాడు.

ఆ యువకుని కళ్ళు చురుకుగా, పట్టుదలగా వున్నాయి.

''ఎలా?'' అన్నాడు రామకృష్ణ.

''మీరింతకాలం పోలీసులుగా ప్రయత్నించారు. నేను ఆ నేరస్థునికి 'ఎర'గా మారి పట్టుకోవడానికి ప్రయత్నిస్తాను. మనం ఒక్కడిని పట్టుకోగలిగినా చాలు. వాడిద్వారా మిగిలినవాళ్ళని ట్రేస్ చేయవచ్చు'' దృఢంగా చెప్పాడు జయంత్.

★★★

టెలిఫోన్ లైన్.

మోడమ్.


కంప్యూటర్.

ఈ మూడూ వుంటే చాలు ఇంట్లోనే ప్రపంచం ప్రత్యక్షమవుతుంది ఇంటర్నెట్ రూపంలో.

డాక్టర్ రామకృష్ణ ఇంట్లోని ఒక ప్రైవేట్ రూమ్‌లో నుండే సైబర్ సైట్‌ని మోనిటర్ చేస్తున్నాడు జయంత్.

దీనికి మొదటి దశ 'సైబర్ ఛాట్'లోకి ప్రవేశించడం.

సైబర్‌చాట్‌లోకి ప్రవేశించిన తరువాత ఆ సమయంలో చాట్‌లో పాల్గొనే వారందరూ తెరపై ఫ్లాష్ అవుతుంటారు. మనం ఎవరితో సంభాషించదలచుకున్నామో వారిని క్లిక్ చేసి మన వివరాలు తెలపడం ద్వారా సంభాషణ ప్రారంభించవచ్చు. దీన్ని ఆన్‌లైన్ ఛాట్ అంటారు. దీన్ని చాలామంది



మంచి ప్రయోజనాలకే వాడుకుంటారు. కానీ కొందరు మాత్రం దీన్ని తమ బలహీనతలు తీర్చుకోవడం కోసం వాడుకుంటారు.

జయంత్ ఒక రెండు మూడురోజులు వరుసగా ఆ చాట్‌లో పాల్గొనే వ్యక్తులను గమనించాడు. టీనేజ్ పిల్లలనీ, ఇంట్లో ఒంటరిగా అభద్రతా భావంతో గడిపేవారినీ ఈ ఇంటర్నెట్ స్నేహాలు త్వరగా ఆకర్షిస్తాయి.

జయంత్ దీక్షగా ఇంటర్నెట్‌లోని సైట్స్ అన్నీ వెదుకుతున్నాడు.

ఒకరోజు స్క్రీన్‌పై ఆన్‌లైన్ ఛాట్‌లో తనికి కావాలసిన బులెటిన్ కనబడింది.

**Looking for a friend**

వెంటనే దానిని క్లిక్ చేశాడు.

కొద్ది క్షణాల్లో ఆ బులెటిన్ తాలూకు ఆపరేటర్- లోగో కంప్యూటర్ తెరపై ప్రత్యక్షమయింది.

తరువాత దాని అప్లికేషన్.

జయంత్ వివరాలలో ఇలా టైప్ చేశాడు.

**Jaya, 14, so looking for a friend**

ఈ హింట్ చాలు అవతలి వ్యక్తికి.

వెంటనే అవతలివైపు నుంచి సమాధానం వచ్చింది.

**Welcome Miss Jaya**

**We can share many things**

కొద్దిసేపు వారి మధ్య అలా 'అక్షరాల సంభాషణ' జరిగిన తరువాత మెల్లగా ఆ సంభాషణ ప్రేమ మీదుగా సెక్స్ విషయాల్లోకి దారి తీసింది. ప్రక్కన వుండి అదంతా చూస్తున్న రామకృష్ణ విస్తుబోయాడు.

ఆ భాష ఎంతో రెచ్చగొట్టేదిగా వుంది!

మధ్య మధ్యలో కొన్ని నగ్నచిత్రాలు కూడా ఫ్లాష్ చేస్తున్నాడు.

ఇలా కొద్దిరోజులపాటు రోజూ కొంచెంసేపు వారి మధ్య సంభాషణలు జరిగాయి. జయ అలియాస్ జయంత్‌పై ఆ అపరిచితునికి నమ్మకం ఏర్పడింది.

వారు ఎదురు చూస్తున్న ప్రశ్న ఆ అపరిచితుని నుండి రానే వచ్చింది.

**Shall we meet**

**Why** జయ (జయంత్) టైప్ చేసాడు.

**We can play-** అవతలి నుంచి సమాధానం.

**I am shy**

**I will take care**

వారు కలుసుకోవడానికి స్థలం, సమయం నిర్ణయమైపోయాయి.

వెంటనే ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ కాశ్యప్‌కి తెలియజేసాడు రామకృష్ణ.

వారికి కావాల్సిన ఆధారాలన్నీ చాలావరకు లభించినట్టే.

అపరిచితుని వెబ్‌సైట్, అతను సాగించిన ఛాట్ రికార్డ్, పధ్నాలుగు సంవత్సరాల మైనర్ బాలికను సెక్స్‌కు ప్రోత్సహించడం... ఇవన్నీ రికార్డ్ అయ్యాయి.

ఇక దొరకవలసింది నేరస్థుడే.

★★★

రెస్టారెంట్‌లో మూలనవున్న ఒక టేబుల్ దగ్గర ఒంటరిగా కూర్చుని వుంది ఒక పధ్నాలుగేళ్ల అమ్మాయి.

ఆమె రెస్టారెంట్ డోర్‌కేసి ఉద్విగ్నంగా చూస్తోంది.

కొద్దిసేపటి తరువాత డోర్ తోసుకుని ఒక యువకుడు లోపలకు ప్రవేశించాడు.

అతని కళ్ళు అటూ ఇటూ వెదికాయి ఒంటరి అమ్మాయికోసం.

అతనికి ఆమె కనబడగానే ఆమెకేసి నడిచాడు.

''ఆర్యూ మిస్ జయ'' అన్నాడు.

అవునన్నట్లు తలూపింది.

అతని కళ్లల్లో వింత మెరుపు.

''గ్లాడ్ టూ సీయూ హియర్'' అన్నాడతను.

ఆమె నవ్వుతూ తలూపింది.

అంతవరకూ దూరంగా వుండి చూస్తున్న ఇన్‌స్పెక్టర్ కాశ్యప్ ఆమె చేసిన సైగతో తన బృందంతో వారికేసి నడిచాడు.

★

**డాక్టర్ దర్భా సత్యనారాయణమూర్తి**